

అరచేతిలో వైకుంఠం

– ఐతా చంద్రయ్య

"సత్తక్కా ... ఓ సత్తక్కా!"

గుడిసె ముందు నిండుగా ప్రవహిస్తున్న మురుగు కాల్వను ఒకే అంగలో గెంతి. బాణంలా దూసుకొచ్చాడు రాజారాం. ఇద్దరు కూతుళ్ల పెళ్లి ఒకే ముహూర్తానికి చెయ్యబోతున్న తండ్రిలా హడావుడి పడిపోతున్నాడు ...

"సత్తక్కా ... ఇయ్యాల్ల మా పార్టీ సభజేత్తున్నరే. నువ్వూ, రంగడు తప్పక రావాలె. మరువొద్దూ ... ఆఁ ...!" ఆదరాబాదరాగా చెప్పి వెళ్లబోతున్న రాజారాంను అనుమానం గోకింది.

"మాట్లాడవేమే ... వస్తవా, రావా?" అదిగాడు — వెనుదిరిగి.

పేరున్న పైరవీకారుగా ఆ బస్తీలో రాజారాం అందరికీ తెలుసు. వయస్సు ముప్పయ్యేడు. ఎప్పుడు ఎన్నికలొచ్చినా మొగమ్మీద ఆసుపోసే కండెలా అటూ, ఇటూ తిరుగుతుంటాడు. ఏదో ఒక పార్టీ కార్యకర్తగా వెలిగిపోతుంటాడు. అక్షరం ముక్కలంటక పోయినా అపారమైన తెలివితేటలున్నాయనుకుంటాడు — తనకు తాను.

"ఏమైందే సత్తక్కా ... రంగడేడీ?"

నిట్టూర్చింది — సత్తక్క అనబడే సత్యలక్ష్మి. ఆవిడ చూపులు శూన్యంలో కెళ్లిపోతున్నై.

నాగరకతకు నిలయమైన మహానగరంలో ఓ

మురికివాడ అది. మురికివాడలో మెయిన్ రోడ్డు. దాని పక్కన నాగరికుల కంపును జాగ్రత్తగా మోసుకొస్తున్న పెద్ద కాల్వ — కాకతీయ కాల్వ కంటే ఏ మాత్రం తీసిపోనంటుంది. నగరంలోని మురికినీరంతా అక్కడే సంగమించి కాళ్లకు గజ్జెలు కట్టుకుని పరుగులు దీస్తుంది. ఎన్నో పిల్ల కాల్వలకు తల్లి కాల్వ — ఆ పెద్ద కాల్వ. కాల్వల పక్కన గుడిశెలు. గుడిశెల మధ్యన రేకు డబ్బాల ఇండ్లు. ఏరి పారేసినట్టు అక్కడొకటి ఇక్కడొకటి పెంకుటిండ్లు గూడాను. సత్యలక్ష్మి గుడిశెకు రెండు పక్కలా కాల్వలున్నై. అవి జీవ నదుల్లా ప్రవహిస్తుంటై. నది ఎండా కాలంలో మిట్ట మధ్యాహ్నం సూర్యప్రతాపం తగ్గితే తగ్గవచ్చు కానీ ఆ కాల్వల్లో నీటి మట్టం మాత్రం తగ్గదు. పూదు పూవులారు కాయలుగా కాపురాలు చేసుకుంటున్న దోమలు దివారాత్రాలు రాగాలు విన్పిస్తుంటై. వీరవిహారం చేస్తుంటై. ఇళ్లలోకి నిరాటంకంగా ప్రవేశించి మనుషుల రక్తం పీల్చుస్తూ దాగుడు మూతలాడుకుంటున్నై. దోమలకూ, వాటి మిత్రపక్షాలైన పందులకూ నిత్యకళ్యాణం పచ్చతోరణమక్కడ.

పిల్ల కాల్వల్లో జలకాలాడి ఒడ్డుమీద ఠీవిగా నడుస్తున్న పందులు మనిషి కంటబడగానే అసహ్యించుకుంటాయి. నిరసనగా భరత నాట్య భంగిమలు చూపిస్తై. అందుకే తెల్లగుడ్డల శాల్తీ లేవీ సంచరించవక్కడ.

ఏదిఏమైనా ఎన్నికల పుణ్యమాని సంచలనం కనబడుతుంది. బస్తీలోని పైరవీరాయుళ్లూ, సన్నకారు నాయకులూ విసుగూ విరామం లేకుండా మొగ్గలేస్తుంటారు. పెద్ద నాయకుడొచ్చే ముందు — వీధుల్ని శుభ్రంగా ఊడ్పించి, కాల్వల్లో ఫినాయిల్ డబ్బాలు కుమ్మరించి, ఒడ్డున రకరకాల పౌడర్లు చల్లిస్తారు మున్సిపాల్టీ పెద్దలు. ఎంతజేసినా పెద్ద నాయకుని చేతిగుడ్డ ముక్కుముందే ఉండి తీరుతుంది.

"ఊఁ ... ఆఁ ... అబ్బా ... అమ్మా ..." గుడిశె మూల నుండి మూల్గులు. సత్యలక్ష్మి చూపులటువైపు తిరిగినై.

"అదిగో ... రంగడక్కడ పడున్న"డని కళ్లతో చూపించింది రాజారాంకు.

"వానికేమైందక్కా?" రాజారాం గొంతు నార్మలైంది.

"పది రోజుల్నుంచీ జొరం. అప్పుడే చలొస్తుంది. ఎంటనే గరం రొట్టె పెంకోలైపోతడు ... పెయ్యి మీద చెయ్యేస్తే సుర్రుమంటది ... తెల్లందాకా నిద్రలేదు ... ఒక్కటే మూల్గుడు ...శానా పరేశానైపోతుంది ..." నిట్టెండకాలం మున్సిపల్ కుళాయిలోంచి రాల్తున్న నీటి బొట్లలా — సత్యలక్ష్మి గొంతులోంచి మాటలు ఆగిఆగి వస్తున్నై. రెండు కళ్లూ వా ఁకాలం చెరువులైపోయినై.

"ప్రొఫెసర్! మీరు నాకిచ్చిన సున్నా మార్కులు నాకెంతో అసంతృప్తికి గురిచేశాయి. ఆవేశంగా చెప్పాడు రాజు.

"కానీ ఏం చేయమంటావు బ్రదర్. అంతకంటే తక్కువ మార్కులు లేవాయె?" చెప్పాడు ప్రొఫెసర్.

—ఎస్. పాండు, నిజామాబాద్

"ఒక్క ఇంట్లనే గింతసేపుంటె ఎట్లా?" రాజారాం అంతరంగం అల్లరి పెట్టింది. ఎందుకైనా మంచిదని.

"అయ్యో పాపం! దావకాన్ల జూపియ్య లేదా?" సానుభూతి జాలువారింది.

"మొన్ననే తోల్కపోయిన — సర్కారు దావకాన్లకు. నాల్గుగంటలు లైన్ల నిల్చుండవెట్టి రెండు గోలీలిచ్చి పొమ్మన్నారు. ఆ గోలీలు ఏ మూలకు పోయినయో ... జొరం ఎక్కువనే అయింది ..."

"గట్లనా ...?" ఒంటికాలు మీదున్నడు రాజారాం.

"ఔను ... మా అయ్యా, మీ బావా గిసొంటి జొరాలతోనే సచ్చిపోయిండ్రు గదా! ..." సత్యలక్ష్మి కళ్లు శ్రావణ మేఘాలైనై. కనుకొలుకుల్లోంచి రాలిన నీటిబొట్లు నేల మీదరాలి ఇంకిపోతున్నై.

"వాళ్లే కాదే ... ఇంక శానామంది గిసొంటి జొరాల్లోని పరేశానైతున్నారు. ఆ దేవుని లీల ... ఏం జేద్దామక్కా!" చేతులు పిసుక్కున్నడు.

రెండు నిమిషాలు ... ఏం మాట్లాడాలో ఎవరికి తోచలేదు.

"రంగడికేం గాదు గానీ, సభకు మీ యవ్వను గూడా దోల్కరా! మీ ఇంట్ల మూడు ఓట్లున్నై గదా!" అంటూ వెళ్ల బోతున్న రాజారాం భుజమ్మీ చెయ్యేసి ఆపింది.

"మన గల్లీలను బాగజేత్తమని ఓట్లు వచ్చినప్పుడల్లా జెప్తున్నారు గదా! ఇక్కడొక దవాఖన గూడా పెట్టిస్తమన్రి గదా! ..." సత్యలక్ష్మి మాటల్ని మధ్యలో తుంచేసి

"ఓహో ... మురికివాడల అభివృద్ధి గదా! ... అన్నారు. నిజమే ..." లోపలి కోపాన్ని బయటికి రానీయకుండా జాగ్రత్త పడ్తున్నాడు.

"ఔను ... పోయిన యాడాది బల్దియా ఓట్లప్పుడూ, రెండేండ్ల కిందోసారి, మూడేండ్ల కిందోసారి ఓట్లడినప్పుడు నువ్వు గూడా జెప్తివి గద రాజారాం" ఏవేవో గుర్తుకొస్తున్నాయావిడకు.

"మరి ... మా పెద్ద లీడరు జెప్పుమంటేనేం జెప్పిన" కోపతాపం హద్దులు దాటుతుంది.

... నేనేమన్నా నా కొరకు ఓట్లడిగిన్నా? మీరేమన్నా పుణ్యానికేసిండ్రా? ... మన మురికివాడల్ని అభివృద్ధిజేస్తమని ఇప్పుడు గూడా అంటున్నాం గదా! భుజమ్మీది చెయ్యి లాగెయ్యబోయాడు. ప్రయత్నం విఫలమైంది."

"సరే గానీ ... ఒక్క పది రూపాయలూ ..." మరో చెయ్యి ముందుకు చాచింది.

"మీరు మాత్రం సభకు రావాలె ... రంగడికింత జావదాగిచ్చి తోల్కరా ... నీ యవ్వ ..." విదిలించుకుని వెళ్లిపోయాడు ... కాదు ... పారిపోయాడు.

* * *

సముద్రములో అల్పపీడన సమయంలో — కోస్తా ప్రాంతాల్లో వర్షంలా — మైకుల హోరు, కాసెట్ల జోరుతో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. మురికివాడల్లో గూడా కాసెట్ల రిక్షాలు గొంతులు చించుకుంటున్నై. పార్టీ నాయకుల ఉపన్యాసాలూ, సినిమా డైలాగులతో బస్తీ జనాల చెవులకు తూట్లు పొడుస్తున్నై.

సాయంత్రమైంది. అందరి ఇళ్లల్లోకి వినబడేలా సభాస్థలి మైకు మొత్తుకుంటుంది.

"మహా ప్రజలారా! మురికివాడలల్ల మురికి జీవితం గడుపుతున్న మీకు దండాలు. ఇలాంటి మురికివాడలు మన దేశంలో బొచ్చెడున్నై కాబట్టే మనది బీద దేశమంటుండ్రు అని మనవి జేత్తున్నా. ఐతే ... ఈ మురికివాడల్ని అభివృద్ధి చెయ్యాలనే మా పార్టీ కంకణం కట్టుకుందనీ మరోసారి మనవి జేత్తున్నా ..." నాయకుని ఉపన్యాసం సాగిపోతుంది.

ఒక కుర్రకుంక చెడ్డీ సర్దుకుంటూ లేచాడు.

"ఇప్పుడున్న మురికివాడలు చాలావా?" గట్టిగా అరిచాడు.

నాయకమణి గొంతులో పచ్చి వెలక్కాయ పడింది. గొంతు సవరించుకోక తప్పలేదు.

"... మహాజనులారా! మా పార్టీ ఉద్దేశ్యం — మురికివాడల మురికినంతా సాఫ్ జేసి క్లీన్‌గా ఉంచాలని సవినయంగా మనవి జేత్తున్నా" గొంతు స్థాయి మరింత పెరిగింది. "ఈ గుడిశెలన్నీ పీకేయిత్తాం ..."

"గుడిశెల్ని పీకెయ్యటంలో మీకు మీరే సాటిగదా!" సభలోంచి వినబడింది.

"అది కాదని మనవి జేత్తున్నా ... ఐతే ... మహాశయురాలా ..."

తన గుడిశెకు కొద్ది దూరంలో జరుగుతున్న సభను తిలకిస్తూ అంతా వింటుంది సత్యలక్ష్మి.

"అమ్మా ... చలి ... అమ్మమ్మో .. చ ... లీ ... హయ్యో ..." లోపల్నుండి రంగడి మూల్గులు వినబడినై.

"మల్లా వొచ్చిందా మాయదారి చలిజొరం ..." గొణుక్కుంటూ లోపలికెళ్లి గొంగడి, దుప్పటి కలిసి కప్పేసింది ... ఏనుగోలున్నోనిది పీనుగోలైనవు కొడుకా. నేనేం జెయ్యాల్రా దేముడా! ఎటుపోవాల్రా దేముడా! మా

ముసల్ది గూడా లేకపోయే ...''

మెలికలు తిరిగిపోతున్న రంగడి అవస్థ చూడలేక చేతులు పిసుక్కుంటుంది. కడుపులోని పేగుల్ని కరకర కోసినట్టనిపించింది. కొంగునోటికడ్డం బెట్టుకుని ఏడుస్తూ కూచుంది.

"... ఐతే ... మహాజనులారా! ఈ మురికివాడల ఒక దవాఖాన పెట్టించాలని మా పార్టీ నిర్ణయించిందని సగర్వంగా విన్నవించుకుంటున్నా. గవర్నమెంటుతోని కొట్లాడైనా సరే ...'' ఉపన్యాసం గుడిశెలోకి చొచ్చుకొస్తుంది.

"అబ్బా ... నువ్వేడ్వకే. అమ్మమ్మ ఊరినుంచి ఎప్పుడొత్తదే! అయ్యో ... అమ్మో ... గర్మీ ... పెయ్యిని పొయ్యల వెట్టినట్టుంది ... కాళ్ళూ చేతులూ ... యాతం బోస్తున్నై. తలకాయ పల్గిపోతుంది. కప్పుకున్న వన్నీ తన్నిపారేశాడు రంగడు. నరాల్లోని సత్తువంగా జ్వరానికాహారమైంది. మొహం నల్లబడింది.

"హమ్మా! నువ్వు నన్ను జూచి ... పరేశాన్ కావద్దే ...'' బోడ బావిలోంచి వచ్చినట్టున్నాయా మాటలు.

రంగడి శరీరమ్మీద చెయ్యేసి వెంటనే వెనక్కు లాక్కుంది.

"ఈ బస్తీల దవాఖాన వెడ్తమని ఎన్నోసార్లన్నరు ముండాకొడుకులు ... దవాఖాన లేదూ, గివాఖాన లేదు ...'' గొణుక్కుంటూ తడిగుడ్డ దెచ్చి నుదుటిమీద ఉంచింది.

సత్యలక్ష్మి బీడీ కార్మికురాలు. రోజూ రెండు వేల బీడీల దాకా చెయ్యగలదు. రంగడు ఫ్యాక్టరీ కార్మికుడు. బీడీ కార్మికుల కూలీరేట్లు పెంచాలని సమ్మె ప్రారంభమై నెలరోజులైంది. పూట గడవడమే కష్టమై పోయింది.

* * *

"సత్తక్కా ... ఓయ్ సత్తక్కా ...!'' బ్రేకుల్లేని సైకిల్లా తోసుకొచ్చాడు — బీడీ కార్మిక నాయకుడు నారాయణ.

"ఆగాగు ... కందిచేన్ల మన్పోతు పడ్డట్టు ఎందుకంత జల్దీ?'' మొహం చిట్లించింది సత్యలక్ష్మి.

"అదిగా దక్కా ...'' రెండు చేతుల్తో దోమల్ని తోలాడు.

"ముందుగాల గిదిజెప్పరా ...'' నారాయణ నోటికి తాళం వేసింది. మా బీడీలోల్ల హర్తాల్ ఎప్పుడు బందైతదీ? కూలి లేక నేనూ, జొరమొచ్చి రంగడూ గొడగొడ ఏడుస్తున్నాం. తిండికి లేక ఛస్తున్నంరా! ఇప్పుడేం జెయ్యాలె నారాయణా?'' భయం, ఆవేదనలు పరుగులు దీస్తున్నై గొంతులో.

ఇవేవీ పట్టించుకునే స్థితిలో లేడు నారాయణ.

"అవన్నీ ఎలక్షన్లైపోయినంక ... ఇయ్యాల్ల మా చెట్టు గుర్తు పార్టీ సభవెడ్తున్నమప్పటికి నువ్వూ, రంగడూ, ముసల్ది ... అందేరూ రాండ్రి. ఆఁ ... మరి ఎల్లుండి చెట్టు గుర్తుకే ఓటు గుద్దాలె .. ఏం ...ేం బోతున్నా'' గుక్క



రమేష్: ఏంటోయ్ ! మీ అబ్బాయికి మాటలొచ్చేసాయా?
సరేష్: అబ్బే ఇంకా లేదు... నేను మాట్లాడినంతసేపు వింటూ కూర్చుంటాడు తప్ప మాట్లాడ డురా...

—వై. ముకేష్, రంగాపురం

తిప్పుకోకుండా చెప్పి పోబోయాడు. అతని భుజం పట్టి ఆపి

"పోయినసారి నువ్వు గుట్ట గుర్తు మీద గుద్దుమన్నవు గదరా!'' నోరెల్ల వెట్టింది.

"నీ యవ్వ ... గదంతా రాజకీయమే. నీకు సమజుగాదు. అవన్నీ నీకెందుకూ ... నేం జెప్పిందానికి గుద్దెయ్ ...''

"రంగడికి శానా జొరమొచ్చిందిరా. కలువరిత్తున్నాడు. కాళ్లూ చేతులు కొట్టుకుంటున్నాడు. నా కాళ్లు వొయ్యి కడుపుల జొచ్చినై. వాడు లేస్తనే లేడురా. ఓ పది రూపాయిలియ్యిరా. మా హర్తాలైపోంగనే ఇస్తా ...'' ఆశలన్నీ కళ్లలో నింపుకుని చెయ్యి చాచింది.

"పైసలా? ... మా లీడర్లింకా ఇయ్యలేదే. ఇయ్యంగనే ఇస్తనక్కా ... నీతోడు .. ఆఁ ...'' బయటెవ్వరో పిలుస్తున్నట్టు పరుగెత్తాడు.

రాత్రి పది దాటింది. తెల్లవారితే ఓటింగ్. రంగడికి స్పృహ రాలేదు. ఏదేదో పలవరిస్తున్నాడు.

"ఇంగో సత్తక్కా ... ముప్పై రూపాయలు. మీ ఇంట్లో మూడోట్లున్నై గదా! ఆ మూడూ చెట్టు గుర్తుకే పడాలె ... తెల్సిందా ...''

సుడిగాలిలా దూసుకొచ్చి మూడు పదిరూపాయల నోట్లు సత్యలక్ష్మి కుడి చేతులుంచి వెళ్లిపోయాడు నారాయణ. గుండె అరల్లో పేరుకుపోతున్న భయాన్ని విధిలేక అణగదొక్కుకుని అతడు వెళ్లిన వైపే చూస్తుంది.

"అమ్మో ... హయ్యో ... అ ... మ్మా ...'' మూల్గాడు రంగడు.

సత్యలక్ష్మిలో ఆశ తళుక్కుమంది. కొడుకు ఒళ్లు తడిమింది. చల్లగా ఉంది. భయమేసింది. పొత్తి కడుపులోంచి లావాలాంటిదేదో పొంగుకొస్తుంది.

"సత్తక్కా .. ఓయ్ సత్తక్కా!'' గుడిశె తలుపు తోసుకొచ్చాడు రాజారాం.

"సత్తక్కా! మీ ఇంట్ల మూడోట్లున్నై గదా! చెట్టు గుర్తోడు ఓటుకు పదిచ్చిండు గదా! మేమిరవై ఇస్తున్నం. తీస్కో అరవై ... ఓట్లు మాత్రం గుట్ట గుర్తుకే గుద్దాలె ఆఁ ... బే ఇమాన్ జేస్తే పాపం మీకే ...'' మూడు ఇరవై రూపాయల నోట్లు ఎడమ చేతులుంచి జవాబుకెదిరి చూడకుండా వెళ్లిపోయాడు.

రెండు చేతుల్లోని నోట్లు కలిపి లెక్కేసింది. తొంబై.

ఆహా! తొంబయున్నై. తెల్లారంగనే రంగణ్ని పెద్ద డాక్టరుకు జూపించాలె. బియ్యం దేవాలె. మూన్నాళ్లు రోజులల్ల రంగడు లేస్తడు. కూలికి పోతడు. మా హర్తాల్ గూడా బంద్ గావొచ్చు ... కారు చీకట్లో మిణుగురు పురుగులా ఆశలు రెక్కలు విప్పుకున్నై.

"అ ... బ్బా ...! అ ...మ్మో! హా ... మ్మా!'' రంగడి నోరు తెరుచుకుంది.

"రంగా ...!'' నోట్లను చూపిస్తూ తెల్లారంగనే పెద్ద డాక్టరుకు జూపిస్తా. బియ్యం గూడా దెస్తా. ఇగోరా పైసలూ ... ఇగో ... మన రాజారాము, నారాయణ ఇద్దరిచ్చిండ్రు. అరేయ్ ... రేపు దవాఖాన నుంచి రాంగా నువ్వు గూడా వోటెయ్యాలె ...''

రంగడి నోరు మూసుకోలేదు. ఒళ్లు తడిమింది గాబరాగా. మంచుముద్దలాగుంది. గుండెల్లో గుండు సూదులు గుచ్చుకున్నై. నోట్లు పక్కన బడేసి

"రంగా ... రంగా ...'' చెవిలో అరిచింది.

జవాబు లేదు. కదలిక అసలే లేదు. గుండె వేగంగా కొట్టుకుంటుంది.

మరోసారి పిలిచింది. లాభం లేదు. మారని మురికిలోకం పోకడ కాశ్చర్యపోతున్నట్టు తెరుచుకున్న రంగని కళ్లూ, నోరూ అలాగే ఉండిపోయినై.

"రంగా ... రంగా ... కొడుకా ...!''

సత్యలక్ష్మిల గర్భకోశం చించుకుని వెలువడిందా పిలుపు. రంగని శవమ్మీద వాలి గుండెలు బాదుకుంటుంది. పెడబొబ్బలు పెడుతుంది. ముక్కులు చీదుకుంటూ బస్తీ జనాలొక్కరొక్క రే వస్తున్నారు.

చుట్టూ చేరిన ఆడవాళ్లు రాగాలు దీస్తున్నారు. మగవాళ్లు మాకిది అలవాటేనన్నట్టు ముడుచుక్కూచున్నారు.

రాజారాం పరుగెత్తుకొచ్చాడు.

అరెరే ... వీడు సావనే సచ్చిండా! మరి .. వీళ్లంతా పీనుగు దగ్గరుంటే తెల్లారంగనే ఓట్లెవలెయ్యాలె? ... గుండె లబలబలాడింది.

"పాపం ... సత్తెక్క ఒక్కతే ఉంది. మనమంతా మనిషో చెయ్యేసి తెల్లారకముందే పీన్గును లావడ్తాం!'' అన్నాడు జాలిగా — అందరివైపు చూస్తూ.

"ఔను ... పాపం! గట్లనే బాగుంటది. రంగడు మంచోడుండె. మనిషో చెయ్యేస్తాం ... పుణ్యమే ...'' నారాయణ ముందుకొచ్చాడు. గుడిశె ముందు స్థిరనివాస మేర్పరుచుకున్న పందులు నిద్రాభంగమైనందుకు గుర్ ర్ర .... గుర్ర్ ర్రమంటూతోకలు ఝాడిస్తున్నై.

●